

మెడికల్ కాలేజీ విద్యార్థుల హవా

ఏలూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాల్లో సత్తాచాటారు.

8లో ▸



ఉద్యమాలే మార్గం

రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ సహాయ కార్యదర్శి సాగర్ అన్నారు.

8లో ▸



ఆలయ భూముల్లో సాగుకు యత్నం

తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెం లోని కోదండ రామాలయ భూములపై అక్రమార్కుల కన్ను పడింది.

8లో ▸

బాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామీ

ధర్మాగ్రహం

- తిరుమల లడ్డూపై దుష్ప్రచారం
- టీడీపీ కుట్ర రాజకీయాలపై సర్వత్రా ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆలయాల్లో పూజలు
- ప్రభుత్వ పాప ప్రక్షాళన జరగాలని ఆకాంక్ష
- జిల్లా అధ్యక్షుడు దూలం ఆధ్వర్యంలో కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తిరుమల తిరుపతి లడ్డూపై దుష్ప్రచారం చేసి ఆలయ పవిత్రతను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ శ్రేణులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమలను రాజకీయాలకు వాడుకుంటున్న చంద్రబాబు తీరుపై, డైవర్షన్ రాజకీయాలపై పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ధ్వజమెత్తి పాప ప్రక్షాళన కోసం ఆలయాల్లో ప్రార్థించారు. ఏలూరు జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నరసాపురం, పాలకొల్లులో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగ్గా.. టీడీపీ కుటిల రాజకీయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్ని నియోజకవర్గాల్లోని మండలాల్లో పార్టీ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేయించారు.

ఏలూరు జిల్లాలో..

- కైకలూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- నూజివీడులోని వేంకటాచలస్వామి ఆలయం, నూజివీడు మండలం రఘునాథస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు ప్రత్యేక పూజలు చేశారు. ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.
- పోలవరం నియోజకవర్గంలో కొయ్యలగూడెం, బుట్టాయగూడెంలోని శివాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. బుట్టాయగూడెంలో వేంకటేశ్వరస్వామికి వైఎస్సార్‌సీపీ గిరిజన ఎంపీటీసీ గాలి దుర్గారావు, పార్టీ నాయకులు సోడెం సుధాకర్ తలనీలాలు సమర్పించారు. జీలుగుమిల్లి, పోలవరం, టి.నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోటలోని వీరభద్రస్వామి ఆలయంలో నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి మోకాళ్లపై మెట్లు ఎక్కి స్వామిని దర్శించుకున్నారు. పార్టీ నేతలు జెట్టి గురునాథం, బత్తిన నాగలక్ష్మి, పోల్నాటి బాబ్జితో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చింతలపూడిలో జెడ్పీటీసీ, ఎంపీపీ ప్రత్యేక పూజలు చేశారు.
- గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమలలో చిన వెంకన్న ఆలయ పాదాల వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు టెంకాయలు కొట్టి చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు చేయించారు.
- దెందులూరు మండలంలోని కనకదుర్గమ్మవారి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల్లోని ఆలయాల్లో పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే లడ్డూ వివాదం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఆలయం వద్ద పూజలు చేయించి బయటకు వస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్, నియోజకవర్గ ఇన్‌చార్జి జయప్రకాష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనా వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి లడ్డూ వివాదం రేపారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు వరదతో అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకుంది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు పాపాలు చేసి జగన్‌పై నెట్టాలని చూస్తున్నారన్నారు. వంద రోజుల పండుగ ఎలా చేసుకోవాలో తెలియక తిరుపతి లడ్డూపై రాజకీయం చేశారని, ముఖ్యమంత్రి స్థానంలో ఉండి దుర్మార్గంగా మాట్లాడిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. భక్తులను మానసిక వేదన, ఆందోళనకు గురిచేశారన్నారు. ఈ వివాదంపై సీబీఐ లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తాము డిమాండ్ చేస్తుంటే.. అవసరం లేదని చంద్రబాబు అనడంలో కుట్ర అర్థమవుతుందన్నారు. చంద్రబాబు పాప ప్రక్షాళన చేసుకోవాలని, మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీవారిని వేడుకుంటున్నామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబుకు దమ్ముంటే లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరిపించాలన్నారు. లడ్డూ అంశంలో మూడు రాష్ట్రాల ప్రమేయం ఉన్నా సిట్ విచారణతో చేతులు దులుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ నాయకులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పశ్చిమగోదావరి జిల్లాలో..

- నరసాపురంలోని రాజగోపాలస్వామి దేవస్థానం, పాలకొల్లులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- తణుకులోని వేంకటేశ్వరస్వామి, ఇరగవరంలోని పాలేశ్వరస్వామి ఆలయాల్లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్తిలి, తణుకు మండలాల్లోని పలు ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూజలు చేయించారు.
- తాడేపల్లిగూడెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలంలోని పలు ఆలయాల్లో పార్టీ శ్రేణులు పూజలు చేయించారు.
- ఉండిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నాయకులు పూజలు చేయించారు.
- ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, ఆచంట మదనగోపాలస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నూజివీడు : ఆలయంలో పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



పెదవేగి : రాట్నాలమ్మ ఆలయంలో పూజలు చేయిస్తున్న నాయకులు

లడ్డూపై పవన్ కల్యాణ్ ఓవరేక్షన్ చేస్తున్నారు

వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త కారుమూరి సునీల్



మాట్లాడుతున్న కారుమూరి సునీల్

కైకలూరు: తిరుమల తిరుపతి లడ్డూ విషయంలో బీజేపీ కంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓవరేక్షన్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ విమర్శించారు. ఆలయాల్లో పాప ప్రక్షాళన కోసం చేపట్టిన పూజల్లో భాగంగా కైకలూరు మీసాల వెంకన్న ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు చెబుతున్న అబద్ధపు మాటల ఫొటోలు కలిగిన ఫ్లకార్డులను కైకలూరులోని పార్టీ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. సునీల్ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు ఏమిటో ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. కుల, మత ప్రస్తావన లేని రాజకీయాలు చేస్తామని పవన్ చెప్పారన్నారు. ఇప్పుడు రోజూ కులాలు, మతాలు లేకుండా ఆయన మాట్లాడటం లేదని ఎద్దేవా చేశారు. ఇటువంటి వ్యక్తినా ప్రజలు డిప్యూటీ సీఎంగా ఎంచుకున్నదని బాధ కలుగుతోందన్నారు. చంద్రబాబు తిరుమల లడ్డూ విషయంలో భక్తులను అయోమయంలోకి నెట్టాశారని చెప్పారు. చంద్రబాబును ఆ దేవుడే శిక్షిస్తారని తెలిపారు.



జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరిలో మోకాలిపై మెట్లు ఎక్కుతున్న నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు



కొయ్యలగూడెం : వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



భీమడోలు : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

న్యూస్‌రీల్

'పశ్చిమ' డీపీఓగా అరుణశ్రీ



బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణశ్రీ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా బి.అరుణశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు డీపీఓగా పనిచేసిన ఆర్.విక్టర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయనగరం జిల్లా డ్వామా అడిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అరుణశ్రీని ఇక్కడ డీపీఓగా నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆమె కలెక్టర్ నాగరాణిని మర్యాద పూర్వకంగా కలిశారు.

రేపు జాబ్‌మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జంగారెడ్డిగూడెంలోని స్కిల్‌హబ్‌లో ఈనెల 30న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సి.మధుభూషన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీస్ లిమిటెడ్, ఎస్ఎస్ఎస్‌వీ (అరబిందో ఫార్మా), ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని సుమారు 220 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి 18–30 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 96425 98324, 9652503799 (9988853335–టోల్ ఫ్రీ) నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏఈఓ రమేష్‌బాబు ద్వారకాతిరుమలకు బదిలీ

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఏఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.రమేష్‌బాబును ద్వారకాతిరుమలకు బదిలీ చేస్తూ దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో ఐదుగురు ఏఈఓలు విధులు నిర్వహిస్తుండగా దసరా ఉత్సవాలకు నాలుగు రోజుల ముందుగా ఇద్దరు ఏఈఓల బదిలీలు దుర్గగుడిలో చర్చనీయాంశంగా మారాయి.

రెవెన్యూ కేసుల పరిష్కారానికి చర్యలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో రెవెన్యూపరంగా కోర్టు కేసులను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. కోర్టు కేసులు స్టేజ్ వారీ రిపోర్టులను కలెక్టరేట్‌కు అందజేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో ఫ్రీ హోల్డ్ ల్యాండ్ కింద ఇచ్చిన భూములను వెరిఫికేషన్ చేసి నివేదికను సమర్పించాలన్నారు. ఇటీవల జిల్లాలో వరదల కారణంగా జరిగిన నష్టానికి సంబంధించి పూర్తి నివేదికను త్వరితగతిన అందించాలన్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో ఏలూరు ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, నూజివీడు వై.భవానీ శంకరి మంచి పనితీరు కనబర్చారని అభినందించారు. వరదల సహాయక చర్యల్లో రెవెన్యూ యంత్రాంగంతో పాటు సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

గూడెం విద్యుత్ ఈఈగా నరసింహమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈగా కె.నరసింహమూర్తి శనివారం జువ్వలపాలెంలోని ఈఈ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రూరల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు భీమవరం ఈఈగా వెళ్లారు. నరసింహమూర్తికి విద్యుత్ 327 యూనియన్ నాయకులు కృష్ణంరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చండి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా భీమవరం పట్టణానికి సంబంధించి విస్సాకోడేరు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో శనివారం ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 2,558 ఇళ్లు రూఫ్ దశలో ఉన్నాయని, డిసెంబర్ నాటికి లబ్ధిదారులు వాటిని పూర్తి చేయాలన్నారు. అలాగే వివిధ దశల్లో ఉన్న 18,097 ఇళ్లను వచ్చే మార్చిలోపు పూర్తిచేయాలని లేకుంటే కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయన్నారు. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచామన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడారు. హౌసింగ్ ఈఈ బి.వెంకటరమణ, ఏఈ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

13 నుంచి చిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

17న తిరుకల్యాణం.. 18న రథోత్సవం



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో చిన వెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 13 నుంచి 20 వరకు వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి శనివారం తెలిపారు. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో శ్రీవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలు జరుపుతామన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు.

ఉత్సవాలు ఇలా..

- 13న ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు ముస్తాబు చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. రాత్రి 7 గంటలకు గజ వాహనంపై గ్రామోత్సవం.
- 14న రాత్రి ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు హంస వాహనంపై గ్రామోత్సవం.
- 16న ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం.
- 17న రాత్రి 8 గంటల నుంచి శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం.
- 18 న రాత్రి 7 గంటల నుంచి రథోత్సవం.
- 19న ఉదయం 7 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ.
- 20న ఉదయం 9 గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపుసేవ, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

కలెక్టరేట్‌లో విభాగాల తనిఖీ

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లను, ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ కె.వెట్రి సెల్వి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల విధులను అడిగి తెలుసుకుని, పక్కాగా రికార్డులను నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలపై ఆరా తీశారు. మంచినీటి సరఫరా, వాష్ రూమ్‌ల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. డ్వామా ఆఫీస్ పక్కన ఉన్న సత్యసాయి వాటర్ ప్లాంట్ మరమ్మతులకు ఆదేశాలు ఇచ్చారు. డీఆర్వో డి.పుష్పమణి, ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీసీఓ శ్రీనివాసరావు, ఏఓ నాంచారయ్య ఆమె వెంట ఉన్నారు.

30న రౌండ్ టేబుల్ సమావేశం

భీమవరం: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు వైఖరిని ఖండిస్తూ ఈనెల 30న కేవీపీఎస్ ఆధ్వర్యంలో భీమవరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు తెలిపారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఏలూరుపాడులో జరిగిన ఫ్లెక్సీ వివాదానికి మత విశ్వాసాలను జోడించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ ఫొటోతో ఉన్న బ్యానర్‌ను స్వయంగా ఎమ్మెల్యే తొలగించడం అన్యాయమన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు భీమవరం లాంచీల రేవు వద్ద నిర్వహించే జిల్లాస్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ పాల్గొంటారన్నారు.

పశు వైద్యశాల పరిశీలన

సాక్షి స్పందన



ప్రహరీ నిర్మాణం కోసం పరిశీలిస్తున్న అధికారులు

పాలకొల్లు సెంట్రల్: 'శిథిలావస్థలో ప్రభుత్వ పశు వైద్యశాల' శీర్షికన శనివారం 'సాక్షి'లో వచ్చిన కథనంపై పశుసంవర్థక శాఖ అధికారులు స్పందించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ పాలకొల్లు పశు వైద్యశాల భవనాన్ని నిర్మించి 52 ఏళ్లు పూర్తయిందని, భవనం శిథిలావస్థకు చేరడంపై వచ్చిన కథనానికి స్పందించి నూతన భవనం నిర్మాణం, మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అలాగే డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా మున్సిపల్ అధికారులు తొలగించిన ప్రహరీ నిర్మాణం నిమిత్తం మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథిని కలిసి మాట్లాడామన్నారు. వెంటనే మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పశు వైద్యశాఖలో ప్రహరీ నిర్మాణం కోసం అంచనాలు తయారీకి వచ్చారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ఆస్పత్రి భవనం పునర్నిర్మిస్తామని చెప్పారు. పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు జి.మల్లేశ్వరరావు, డీఈ రాజ్‌కుమార్, ఏఈ సాంబశివుడు ఉన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం



శ్రీవారి ఆలయంలో నామమాత్రంగా ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు చినవెంకన్నను దర్శిస్తుంటారు. ఈ వారం భక్తులు నామమాత్రంగా శ్రీవారిని దర్శించారు. దాంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది.

కార్మికులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇళ్ల వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో జరుగుతున్న మత రాజకీయాల నుంచి కార్మిక వర్గం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక జంగారెడ్డిగూడెం మానవతా కల్యాణ మండపంలో సీఐటీయు జిల్లా సదస్సును ప్రారంభించి ఆయన మాట్లాడారు. సీతారాం ఏచూరి తన జీవితంలో సమస్త శ్రామిక వర్గానికి సమాన అవకాశాలు పొందడం కోసం పోరాడారని వారి ఆశయాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతం చేస్తోందని విమర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, దానిని కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సీఐటీయు పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు ఆవిష్కరించగా, ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. సిఐటియు జిల్లా కమిటీ ఆఫీసు బ్యారర్స్ ఎస్కె సుభాషిణి, కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు మెడికల్ కాలేజీ విద్యార్థుల హవా

- ఫస్ట్ ఇయర్ ఎంబీబీఎస్ అనాటమీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్
- మొదటి ఏడాదిలోనే సత్తా చాటిన విద్యార్థులు



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం (ఫైల్)

ఏలూరు టౌన్ : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు మొదటి ఏడాది ఎంబీబీఎస్ పరీక్షల్లో సత్తా చాటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతిష్టాత్మకంగా ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయగా.. మొదటి ఏడాది వైద్య విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. అనాటమీ సబ్జెక్టులో ఏకంగా రాష్ట్రస్థాయిలో మొదటి పది ర్యాంకుల్లో నాలుగు స్థానాలు కైవసం చేసుకున్నారు. నిపుణులైన ప్రొఫెసర్లు, అధ్యాపకులతో వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటంలో ఏలూరు వైద్య కళాశాల హెచ్‌వోడీలు, అధ్యాపక బృందం అవిరళ కృషి చేశారు.

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 2023 సెప్టెంబర్ 2న మొదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 150 మంది వైద్య విద్యార్థులు చేరగా అత్యుత్తమ విద్యాబోధనతో మొదటి ఏడాది పరీక్షల్లో తమ ప్రతిభ చాటుకున్నారు.

ఎంబీబీఎస్ అనాటమీ సబ్జెక్టులో రాష్ట్ర స్థాయి మొదటి 10 ర్యాంకుల్లో నాలుగు ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు సాధించటం విశేషం. మద్దుల సాయి నాగవెంకట్ అనాటమీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో(254 మార్కులతో) మొదటి ర్యాంకు, బడిన కోటేశ్వరి (249 మార్కులతో) 3వ ర్యాంకు, కే.అష్మి (247) 6వ ర్యాంకు, పైడి హేమలత (244) 9వ ర్యాంకు సాధించారు. . ఏడుగురు విద్యార్థులు డిస్టింక్షన్‌లో, 92 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్, 32 మంది విద్యార్థులు సెకండ్ క్లాస్ సాధించారు. ఏలూరు వైద్య కళాశాలలో మొత్తంగా 90 శాతం ఉత్తీర్ణత సాధించారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ చెప్పారు.

ఉత్తమ వైద్య సేవలు అందిస్తా



మొదటి ఏడాది పరీక్షల్లో అనాటమీలో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. పీజీ పూర్తి చేసిన అనంతరం మన సొంత గ్రామం, రాష్ట్రంలోనే ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలనే కోరిక ఉంది. వైద్యుడిగా మా కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

– మద్దుల సాయినాగవెంకట్, వైద్య విద్యార్థి

గైనకాలజిస్టుగా సేవలందిస్తా



నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. అనాటమీలో రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకు సాధించటం ఎంతో ఆనందంగా ఉంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం వైద్య విద్యలో పీజీ పూర్తి చేయాలని నా లక్ష్యం. గైనకాలజిస్ట్‌గా మహిళలకు సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.

– బాడిన కోటేశ్వరి, వైద్య విద్యార్థిని

వైద్యురాలిగా పేరు తెచ్చుకోవాలి



ఆలిండియా కోటాలో ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించాను. మాది కేరళ. ఏలూరు వచ్చాక తెలుగు నేర్చుకుంటున్నా. మొదటి ఏడాది పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు తెచ్చుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– కే అష్మి, వైద్య విద్యార్థిని

కాలేజీలో సౌకర్యాలు బాగున్నాయి



మా కుటుంబంలో, బంధువుల్లో మొదటి వైద్యురాలిని. ఫస్ట్‌ఇయర్ ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు రావటం సంతోషంగా ఉంది. వైద్యురాలిగా స్థిరపడి అందరికీ సేవ చేయాలనే ఆశయంతో చదువుతున్నాను. ఈ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

– పైడి హేమలత, వైద్యవిద్యార్థిని

కష్టానికి తగ్గ ఫలితం



ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసిన మొదటి ఏడాదిలోనే మా వైద్య విద్యార్థులు కష్టపడి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభను ప్రదర్శించారు. హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బోధనతోపాటు, విద్యార్థుల కష్టానికి తగిన ఫలితాలు వచ్చాయి.

– డాక్టర్ ఎం.శశిధర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు

సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు



ఘన జీవామృతం తయారీని పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు

ద్వారకాతిరుమల : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంటలో సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరులు, శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వనరుల కేంద్రంలో ఏపీసీఎన్ఎఫ్ ప్రోగ్రాం కింద, ప్రకృతి సేద్యంలో భాగంగా కషాయాలు, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలించారు. వాటి తయారీకి వినియోగించే సహజసిద్ధమైన గోమూత్రం, గో నెయ్యి, గో పంచకం, ఆవు పేడ, కోడిగుడ్డు, నిమ్మరసం, తూటి ఆకుల కషాయం మొదలైనవాటిని స్వయంగా కలిపే విధానాన్ని పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కేంద్రం పనితీరును డైరెక్టర్ ఢిల్లీ రావుకు ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగును విస్తరింపజేస్తున్న ప్రకృతి వ్యవసాయ వనరుల ట్రైనర్ ఒబిలిశెట్టి గోపాలకృష్ణమూర్తిని, సిబ్బందిని, రైతులను ఢిల్లీ రావు ప్రత్యేకంగా అభినందించారు. గోపాలకృష్ణమూర్తి ఎంతో మందికి ఆదర్శమని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా మేనేజర్ బాలిన వెంకటేష్, భీమడోలు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.ఉషారాజ్ కుమారి, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, భీమడోలు మండలాల వ్యవసాయ అధికారులు అయ్యంకి దుర్గా రమేష్, ప్రవీణ్, ఉషాకుమారి, ఏపీసీఎన్ఎఫ్అఫ్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో సాగుకు యత్నం



అక్రమ సాగు చేపట్టేందుకు పామాయిల్ చెట్లను జేసీబీలతో కూల్చి వేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెంలో కోదండ రామాలయానికి చెందిన భూములపై అక్రమార్కుల కన్ను పడింది. టీడీపీకి చెందిన ఒక నేత ఈ భూముల్లో గత రెండు రోజులుగా జేసీబీలతో పామాయిల్ చెట్లను కూల్చివేసి భూమి చదును చేసే పనులు చేపట్టారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ భూముల్లో అక్రమ సాగు చేసేందుకు పొగాకు నారు సిద్ధం చేశారు. అధికార పార్టీ అండదండలతోనే ఇదంతా జరుగుతోందని అంటున్నారు. చల్లవారిగూడెంలో కోదండ రామాలయానికి 1957లో పెండ్యాల వెంకట రామారావు 42 ఎకరాల 79 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాలువ తవ్వకాలకు అధికారులు భూసేకరణ చేపట్టారు. రామాలయానికి చెందిన భూముల మీదుగా ఈ కాలువ వెళ్లడంతో 2015లో 12 ఎకరాల వరకు ఆలయ భూములను కాలువకు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటన ద్వారా తెలిపింది. అప్పట్లో కొంతమంది అక్రమార్కులు ఎత్తిపోతల పథకం పరిహారం కాజేసేందుకు ప్రయత్నాలు చేపట్టారు. దీంతో అప్పట్లో దేవదాయ శాఖ అప్రమత్తమై ఆలయానికి చెందిన ఈ భూములకు సంబంధించి పరిహారం రామాలయానికే చెందాలంటూ కోర్టును ఆశ్రయించింది. దాంతో ఆలయానికి చెందిన ఈ భూముల్లో ఎత్తిపోతల పథకం కాలువ పనులు చేపట్టలేదు. ఈ భూముల్లో ఎన్నో ఏళ్ల నుంచి భారీగా పెరిగిన పామాయిల్ చెట్లు ఉన్నాయి. ఈ చెట్లను గత రెండు రోజుల నుంచి కూల్చి అక్రమ సాగుకు సిద్ధం చేస్తున్నారు. రామాలయానికి చెందిన భూములకు రక్షణ కల్పించాలని, ఈ భూముల్లో అక్రమ సాగుకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని భక్తులు, రైతులు కోరుతున్నారు.

సివిల్ ఇంజనీరింగ్‌లో మార్పులపై అవగాహన పెంచుకోవాలి



నూజివీడు ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ

నూజివీడు: అంతర్జాతీయంగా సివిల్ ఇంజినీరింగ్‌లో వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవాలని అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆరేపల్లి ఉమామహేశ్వర్ అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేటివ్ సస్టైనబుల్ పేవ్‌మెంట్ డిజైన్ అంశంపై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌కు ప్రపంచ వ్యాప్తంగా అపార అవకాశాలున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్‌తో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ వర్చువల్‌గా మాట్లాడుతూ నిర్మాణ రంగమంతా సివిల్ ఇంజినీర్లపైనే ఆధారపడి ఉందన్నారు. వర్క్‌షాపులో 223 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన బీటెక్, ఎంటెక్ విద్యార్థులు 85 మంది, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 138 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గోపాలరాజు, సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ సునీల్‌భగత్, ఆర్జీయూకేటీ డీన్ అకడమిక్స్ పాల్గొన్నారు.


ఆన్‌లైన్‌లో కేసుల దాఖలుపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జిల్లా జడ్జి మంగాకుమారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కక్షిదారులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన న్యాయ సేవలు అందించడం కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా కేసుల దాఖలుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి జిల్లా జడ్జి పీ మంగాకుమారి తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం శనివారం న్యాయ సేవాధికార సంస్థ భవనంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు ఆన్‌లైన్ విధానం ద్వారా కేసుల దాఖలు ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా కక్షిదారులకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయన్నారు. ఈ ఫైలింగ్ ద్వారా కేసులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవడం, కేసుల విచారణ, వాయిదాలు నేరుగా ఎస్ఎంఎస్ ద్వారా కక్షిదారులకు చేరుకోవడానికి మరింత ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేవీపీ బుల్లి కృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



పెదవేగి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

పెదవేగి : తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశామని పెదవేగి ఇన్‌చార్జి తహసీల్దార్ భ్రమరాంబ తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి, జానంపేట గ్రామాలకు చెందిన వ్యక్తులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లను సీజ్ చేశారు. పెదవేగి మండలంలో తమ్మిలేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న 5 ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి సీజ్ చేశారు.

ట్రిపుల్ ఐటీ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డీన్‌గా శ్యామ్



నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.శ్యామ్ ఆర్జీయూకేటీ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇంక్యుబేషన్ డీన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు పెట్టాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత బహుజన సంఘం నాయకుడు జోజి బాబు

ఆగిరిపల్లి: బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత బహుజన పరిరక్షణ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు మొగదాటి జోజిబాబు డిమాండ్ చేశారు. ఆగిరిపల్లిలో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు ఉద్దేశపూర్వకంగానే అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి అవమానించాడన్నారు. ఇలాంటి దారుణానికి పాల్పడిన రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

నల్లి రాజేష్ గృహ నిర్బంధం



పాలకొల్లులో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

పాలకొల్లు అర్బన్ : ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ శనివారం వీరవాసరంలో చేపట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. పట్టణ సీఐ కోలా రజనీకుమార్, పోలీసులు రాజేష్‌ను పాలకొల్లులో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను భారతదేశం దేవుడిలా పూజిస్తుంటే అధికార దాహంతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫ్లెక్సీని చించివేసి అధికార దర్పాన్ని ప్రదర్శించారని విమర్శించారు. అంబేడ్కర్ ఫ్లెక్సీని చించడమంటే అంబేడ్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్, నాయకులు పొనుకుమట్ల వీరాస్వామి, పాలపర్తి కృపానాథ్, నల్లి జయరాజు, మట్టా చంద్రశేఖర్, పెనుమాల బోసు, బత్తుల భూపతి, సబితి పద్మారావు, కార్యకర్తలను అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు.

కాకిలేటి మధు హౌస్ అరెస్టు

నరసాపురం రూరల్: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలు లాగేసి అవమానించినందుకు నిరసన తెలుపుతున్న నేతలను హౌస్ అరెస్టు చేయడం తగదని మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు కాకిలేటి ఆనందకుమార్ (మధు) అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ముట్టడికి దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో పోలీసులు ఎక్కడికక్కడ సంఘ నాయకులను గృహ నిర్బంధం చేశారు. కాకిలేటి మధును శనివారం ఉదయం నరసాపురం మండలంలోని చిట్టవరంలోని ఆయన ఇంటి వద్ద గృహనిర్బంధం చేశారు.

రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గం



ద్వారకాతిరుమలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రస్థాయి కార్యకర్తల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ సహాయ కార్యదర్శి సాగర్

ద్వారకాతిరుమల : రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్ అన్నారు. ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రస్థాయి కార్యకర్తల రెండో రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం సాగర్ దేశంలో జరిగిన రైతు ఉద్యమ చరిత్రను కార్యకర్తలకు వివరించారు. పోరాటాల ద్వారానే రైతులు హక్కులను సాధించారని చెప్పారు. ప్రస్తుత పాలకులు రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని విమర్శించారు. ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పోరాడి విజయం సాధించారని, కేంద్రం మెడలు వంచారని తెలిపారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 2020 నవంబర్ 26న ఢిల్లీ రైతు ఉద్యమం ప్రారంభమైందని, దీన్ని పురస్కరించుకుని ఈ ఏడాది నవంబర్ 26న దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సభ పిలుపునిచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్రాపు సూర్యనారాయణ, జొన్నా శివ శంకరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.మోహన రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు ప్రసంగించారు.

గోగుంట సొసైటీకి రూ.1.51 కోట్ల నికర లాభం



గోగుంట సొసైటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మూర్తి

పెదపాడు: 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.51 కోట్ల నికర లాభం ఆర్జించిన గోగుంట సొసైటీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే లాభాల్లో మొదటి స్థానం సాధించిందని సంఘ ప్రత్యేక అధికారి మూర్తి తెలిపారు. పెదపాడు మండలంలోని గోగుంట సొసైటీలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గోగుంట సొసైటీ ప్రత్యేక అధికారి మూర్తి 2023–24 ఆర్థిక సంవత్సరం ఆడిట్ రిపోర్టు చదివి వినిపించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 258 సొసైటీల్లో పెదపాడు మండలంలోని గోగుంట సొసైటీ అత్యధిక లాభాలు ఆర్జించిందన్నారు. గత ఏడాది కూడా సొసైటీ సభ్యులకు షేరుధనం రూ.3.8 కోట్లపై 18 శాతం డివిడెండ్ ప్రకటించినట్లు చెప్పారు. ఈ ఏడాది రూ.3.08 కోట్ల షేరు ధనంపై రూ.65.86 లక్షలు డివిడెండ్‌గా అందిస్తున్నట్లు ప్రకటించారు. సొసైటీ త్రిమెన్ కమిటీ ఛైర్మన్ భావరాజు సత్యనారాయణ తన పదవీ కాలంలో సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేయడంతో లాభాలు ఆర్జించినట్లు సిబ్బంది తెలిపారు. 2024 జూన్ నాటికి రూ.46 కోట్ల ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నట్లు చెప్పారు. సభ్యులకు సకాలంలో సేవలందిస్తూ రుణాలు అందించడంలోను విశేష సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోగుంట సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎంవీఎస్ కుటుంబశాస్త్రి, మాజీ త్రిమెన్ కమిటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ ప్రసంగించారు.